# ఏటేటా వివాహం

పంతుల జోగారావు

సోఫాలో కూర్చుంటూ ఆ అమ్మాయి వేపు చూశాను. సన్నగా పొడుగ్గా ఉంది. చామన చాయ. ఒంటికి నప్పే విధంగా అలంకరణ చేసుకునే నేర్పు ఆమెకుందని చూస్తూనే గ్రహించవొచ్చు.

నన్ను చూస్తూనే ఆమె 'నమస్కారమండీ' అంటూ లేచింది.

"నమస్తే. టేక్ యువర్ సీట్." ఆమె పొందికగా సోఫామీద కూర్చుంది. పేపరందుకుంటూ అడిగాను: "వాట్ కెన్ ఐడూ ఫర్ యూ మిస్ "

"లావణ్య."

"ప్రెటీ నేమ్." ఆమె అందంగా సిగ్గుపడింది. రెండుక్షణాల తరువాత నెమ్మదిగా అంది. "నేను చయనులు గారమ్మాయినండి .."

చయను లెవరు చెప్మా? నాకు గుర్తుండే చావదు. "ఊఁ" అన్నాను ఆమె గ్రహించేసింది. "కె. వి. చైనులు గారండీ" అంది తిరిగి. "ఓహో! అతనా!" అనేశాను. నా అవస్థ అర్థం చేసుకుని మూడోసారి మళ్ళీ ప్రయత్నించిందా అమ్మాయి: "సీతానగరంలో వుండే వాళ్ళు కదా సార్. ."

చప్పున గుర్తొచ్చింది. నా మతిరపుకి నాకే చిరాకనిపించింది. వాడిని మరిచి పోవటమేమిటి నేను! "నీకు మనస్ఫూర్తిగా స్నేహం చెయ్యటం తెలీదురా చలపా....మంచి స్నేహంలో ఎంత తియ్యదనం వుంటుందో నీకీ జన్మకి అర్థంకాదు ఫో!" అనేవాడు కదూ! నిజమేనేమో! ఎప్పటిమాట! ముప్పై ఏళ్ళు పైబడింది కదూ? ఒకే స్కూల్లో చదువుకున్నాం. కలిసే తిరిగేవాళ్ళం ఎప్పుడూ. మొగుడూ పెళ్ళాలనే వారు మమ్మల్ని.

నా ముఖం వికసించింది. "అలాగా అమ్మా! ఎంతకాలమైందనీ వాడ్ని చూసి! ..బాగున్నాడా?"

"ఆయన ఒంట్లో బావు లేదండీ. పెద్దాసుపత్రిలో ఓసారి చూపిద్దామని యిక్కడికి తీసుకొచ్చాం....ఇక్కడ మా మేనత్త ఒకావిడ వున్నారు. మీరీవూళ్లోనే వున్నట్టు మామయ్యగారి ఫ్రెండెవరో చెప్పారు."

"అయ్యో అలాగా అమ్మాయ్! జబ్బేమిటి?"

"ఒకటని లేదండీ....రోజుకీ కంప్లెయింట్. జనరల్ వీక్‌నెస్."

నాకు కష్టమనిపించింది. "ఎక్కడుంటున్నా రమ్మాయ్?" "లలితా కాలనీలోనండీ." వెంటనే వెళ్ళి వాడ్ని చూడాలనే ఉంది. కాని, నాకివాళ అవతల ముఖ్యమైన ఎంగేజ్‌మెంట్సున్నాయి. సాయంత్రం

వస్తానని చెప్పి, అడ్రసు తీసుకున్నాను. "నువ్వెళ్ళిరామ్మా ..సాయంత్రం నేనూ మా ఆవిడ వస్తాం" పాపం, వాడిస్థితి తలుచుకుంటే బాధ కలుగుతోంది. అప్పట్లోనూ యిలాగే వుండేవాడులే... బల్లిగాడనే వాళ్ళం వాడిని."

ఆ అమ్మాయి లేవలేదు. ఎందుకో తటపటాయిస్తూంది.

"డబ్బేమైనా కావాలా అమ్మాయ్?" ఆమె మనోభావం గ్రహించిన వాడిమల్లే అన్నాను ఆమె ముఖం చిన్నబోయింది. గుప్పెట్లో అంతవరకూ మూసివుంచిన చీటీ నా చేతిలో పెట్టేసి తలదించేసుకుంది.

నేనామె వేపు సాలోచనగా చూసి, చీటీ విప్పాను. దస్తూరీ బాగాలేదు వణకు జబ్బున్నవాడు రాసినట్లుగానే వుంది.

"చలపతీ!

కష్టంలో వున్నాను. అమ్మాయి కేదయినా ఉద్యోగమిచ్చి ఆదుకోవయ్యా. నీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేను. చేసిన రుణాలు తీర్చకపోవటమే నా కలవాటయ్యింది. ఉంటాను."

బహుశా గుర్తుంచి వుంటావు,
నీ చయనులు."

తలెత్తి ఆమె వేపు చూశాను. ఆమె కనుకొలకులలో సన్నగా నీళ్ళు తిరగటం గమనించాను. "ఏం చదవావు అమ్మాయి?"

"పి. యూ. సీ. సెకెండ్ క్లాసు వచ్చిందండీ."

"మంచిది. టైపింగ్ వచ్చునా?"

'రాదండీ' 'రాదూ? పోనీలే.. రేపొకసారి మళ్ళీరా.'

ఆ అమ్మాయి ముఖం ఆశతో వెలిగిపోయింది. ఆమెను మరింత సంతోషపరచాలనిపించింది. "ఓ ఖాళీ వుందిలే అమ్మాయ్ తప్పక నీకే యిస్తాను.. ఇక వెళ్ళిరా."

"థాంక్సండీ" ఆమె కృతజ్ఞతా పూర్వకంగా నా వేపు చూసింది. నేను గర్వంగా చిరునవ్వు విసరి బట్టతలని నిమురుకున్నాను.

ఆమె వెళ్ళిపోయింది,

* *

లావణ్యకి ఉద్యోగమిచ్చేందుకు నాకెలాంటి అభ్యంతరమూ ఉండదు. నా ఆఫీసులో నా చేతిలోనే ఓ పోస్ట్ ఖాళీగా వుంది. దాన్ని క్రియేట్ చేసి సరైన అమ్మాయికోసమే చూస్తున్నాను!

"సరైన" అంటే అర్థం కొంచెం విడదీసి చెప్పాలి. చదువూ, అనుభవమూ అలా వుండగా ఈ క్రింది అదనపు అర్హత లుండాలి.

(1) నెమ్మదస్తురాలయిన అవివాహిత అయి వుండాలి.

(2) మాతో వివాహ సంబంధానికి వీలుపడేదై వుండాలి.

(3) ఉద్యోగం చెయ్యవలసిన అవసరం కచ్చితంగా కలిగి వుండాలి.

(4) జులాయి వెధవలా తిరిగే మా

యువ

ఒక్కగానొక్క పుత్రరత్నాన్ని పెళ్ళిచేసుకుందుకు అంగీకరించాలి.

లాయక్కు పై వాటిలో మొదటి మూడు అర్హతలూ వున్నాయని తెలిసిపోయింది. ఇక నాలుగో దాని సంగతా? ఆమె మా చైనులుగాడి కసూ ర్తే కనుక ఆ విషయంలో సందేహమే అనవసర మనుకుంటాను.

మా వాడు ఎస్సెల్సీ మూడు మార్లు డింకీలుకొట్టి నాలుగోసారి, వచ్చిన ఇన్విజలేటర్ని బెదరగొట్టి స్లిప్పులు దట్టించి రాసి పారేసి పాసయి పూరుకున్నాడు.

నా లోపమో, వాళ్ళమ్మమ్మ గారింట్లో చాలా కాలం పెరగటంవల్లనో, యివేమీ కాక మా ఆవిడ ఎప్పుడూ అంటూవుండే నుదుటివ్రాత బాగులేక పోవటమో కాని— మా ఇంటా వంటాలేని జులాయితనమంతా మా వాడికొచ్చింది. నా లోపమని వొప్పుకోవటానికి మనస్సు పీకుతూ వుంటుంది. మన చేతిలో ఏముందండీ. మన వెర్రి కాని, ఒకరి జీవితాన్ని బాగుచేయటమో, పాడుచేయటమో మన చేతిలో వుంటుందండీ....అంతా మన భ్రమకానీ....ఎలా రాసిపెట్టి వుందో అలా జరక్క తప్పదు. చూస్తుండటమే మన పని. '

మా ఆవిడ వాదనని ఒక్కనాటికీ ఒప్పుకోవాలనిపించదు నాకు. నాకు వెంటి మెంట్సు లేవు...ఇకపోతే..,వాళ్ళమ్మమ్మ గారి గారాబమే వాడ్ని చెడగొట్టింది.

వాడి శరీరం మీద చెయ్యివేసేందుకు నా కధికారం వున్నంత కాలం—వాడ్ని, నాలోని మమత, ముఖ్యంగా మా ఆవిడా ఆదుకున్నారు. నా 'మనోనేత్రం' విప్పుకునే సరికి పుణ్యకాలం కాస్తా హారించుకుపోయింది.

వాడి కెలాంటి అలవాట్లున్నాయో నే నెరుగను కానీ. వాడ్ని యింట్లో నేను చూడడం చాలా తక్కువ. నాలుగైదు రోజులకొక పర్యాయమో యేమో! వాడి గురించే నా కెప్పుడూ బెంగ. ఏం చెయ్యటానికీ తోచదు రానురాను వాడి ధోరణి బాగా అలవాటయి పోయింది.

మా ఆవిడ అంటూవుండే "అద్దాల నాడు బిడ్డలు గానీ, గడ్డాలనాడుటండీ?" అనే వాక్యంలో ఎంత చక్కని స్వారస్యం యిమిడివుందో నాకిప్పు డర్ధమవుతోంది.

ఎవరు చెప్పేరో కానీ, పెళ్ళి చేస్తే యీ తిరుగుళ్ళన్నీ కట్టిపోతాయన్న వార్త మా ఆవిడ మోసుకొచ్చింది. అక్కడ్నుంచి ఒకటే పోరు....

నాకూ అలా చెయ్యటమే మంచి దని పిస్తోంది. లేకుంటే వాడి దైలాగుల తీరు చూస్తేమాత్రం — చెప్పా చేయకుండా ఏ లవ్ మేరేజో చేసుకుని....ఎవతెనో తీసుకొచ్చేస్తాడని నా అనుమానం....

"ఎవరండీ వచ్చిందీ?" అంటూ వచ్చింది వరలక్ష్మి.

"నీ కాబోయే కోడలోయ్" అన్నాను నవ్వుతూ. "చాల్లెండి....ఇంతకూ ఎవరో చెప్పరాదూ, బడాయి?"

చెప్పాను. చెప్పింది లగాయితు ఆ అమ్మాయిని చూడాలంటూ ఆవిడ ఆత్రత పడసాగింది. కష్టంమీద సాయంత్రం వెళ్దామని వొప్పించాను . .లేచి, ఆవిడ అందించిన కోటు వేసుకుంటూ వెళ్లి కారులో కూచున్నాను.

''టాటా—వొస్తానోయ్''.

ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ యింట్లోకి వెళ్లిపోయింది వరలక్ష్మి. నా కింకా కొంటెతనం పోలేదనుకుంటూ నవ్వుకుంటోందేమో!

* *

సాయంత్రం కాఫీ టిఫిన్ పూర్తయాక లలితా కాలనీకి బయలుదేరాను. వరలక్ష్మికూడా సిద్ధంగానే ఉంది. చిలకాకు పచ్చరంగు కంచిపట్టుచీర కట్టుకుంది. అచ్చు వరలక్ష్మిలాగే ఉంది!

''బాగున్నావోయ్ వరం!''

ఉరిమి వురిమి నావేపు చూసింది, ''చాల్లెండి ' అంది. నవ్వుతూ వెళ్లి కార్లో కూచున్నాను. ఆవిడకూడా కారెక్కాక కారు స్టార్టు చేశాను.

ఆ యిల్లు చేరేసరికి, లావణ్య మా కోసమే ఎదురుచూస్తూ వీధి గుమ్మంలోనే కనిపించి నవ్వుతూ అహ్వానించింది. వరలక్ష్మి అప్పుడే ఆమెను నఖశిఖ పర్యంతం ''చెక్'' చేసేస్తోంది! ఆవిడ సంతుష్టిగానే ఉంది. తీసుకొచ్చిన పళ్లు లావణ్యచేతిలో పెట్టింది.

చయనులు కుక్కిమంచంమీద పడుకున్నాడు. అతని మంచంముందు బెంచీ మీద మందుసీసా లున్నాయి మాసిపోయిన దుప్పటి కప్పుకుని, పెరిగిపోయిన గడ్డంతో, లోతుకుపోయిన కళ్లతో, చయనులు జీవచ్ఛవంలా ఉన్నాడు, ఎలా అయిపోయాడో?

లేనిశక్తి తెచ్చుకుని ప్రశ్నించాడు ''రా చలపతీ! బాగున్నావా? ఏమ్మా బాగున్నారా?

నేను వొగిసలాడిపోతున్న ఓ కుర్చీ మీద జాగ్రత్తగా కూర్చుని, వాడి చెయ్యి పట్టుకుని అన్నాను ''ఏరా చేనులూ! ఎలా తయారయావో తెలుసా? పోల్చుకో లేనంతగా మారిపోయావనుకో. .డాక్టరేమంటాడు?''

''ఏమంటాడులే—నక్కలా ఉన్నావు ...యిప్పుడిప్పుడే చావవులే అని అభయమిస్తాడు.''

''చాల్లే ...భావుకతతో మాట్లాడకు ... నాకు నచ్చదు.'' వాడిముఖంలో సన్నని నవ్వు పులుముకుంది. ''నువ్వు మారలేదయ్యా చలపా! సరిగ్గా అప్పట్లోనూ యిలాగే అనేవాడివి తెలుసా?''

ఇద్దరం చిన్ననాటి కబుర్లలో పడిపోయాం. ''ఆయనకు మరి రెస్టివ్వరా, యేమిటి?'' అంది వరలక్ష్మి. ఆవిడ లావణ్య మేనత్తతో కాబోలు—మాట్లాడుతోంది, వంటింటి గుమ్మం దగ్గర నించుని. లావణ్య వచ్చి, తండ్రికి మందిచ్చింది.

''రేపొచ్చి ఆఫీసులో నేకలుసుకోమ్మా. మా ఆఫీసెక్కడో తెలుసా?''




“డాబా గార్డెన్స్‌లో కదండి,,, మెసర్స్ లావ్ అండ్ రాజూ ఫైనాన్స్ కార్పొరేషన్....” తలూపాను.

చయనులు కృతజ్ఞతాపూర్వకంగా నా చెయ్యి అందుకుని యిలా అన్నాడు “నీ మేలు మరచిపోలేనురా చలపతీ!” లావణ్య అత్తయ్య నా వేపు గౌరవ పురస్సరంగా చూడటం గమనించాను.

“చాల్లే” అన్నాను.

చీకటి పడుతూవుంటే యింటికి బయలుదేరాం. వచ్చేస్తూ, లావణ్యచేతిలో వందరూపాయల నోటుంచాను. యిబ్బందిగా ముఖం పెట్టింది. తీసుకోలేదు. నెల నెలా జీతంలో మినహాయించుకుంటాను లెమ్మని చెబితే తీసుకుంది.

* *

లావణ్య నా ఆఫీసులో చేరింది. జీతం రెండొందలు. చాలా అణకువగా పని చేసుకు పోతూ ఉంటుంది. మేం మూడు రోజుల కొక పర్యాయమయినా లలితా కాలనీకి వెళ్ళొస్తున్నాం.

ఉద్యోగంలో చేరాక, లావణ్య ఆమె తండ్రి ఆ యింటికి దగ్గరలోనే ఓ గది అద్దెకు తీసుకున్నారు. ఇప్పుడు వాళ్ళ ఆర్థికస్థితి కొంచెం మెరుగయింది. చయనులు ఆరోగ్యంకూడా కుదుటబడిందనే చెప్పాలి. కనీసం మునపటంత అధ్వాన్నంగా లేదు. వాడి భార్య పార్వతమ్మ, సీతానగరంనుంచి అఖరబ్బాయిని వెంట బెట్టుకుని ఒకటి రెండుసార్లు వచ్చివెళ్ళింది.

రెణ్ణెళ్ళ గడిచినదగ్గరనుంచీ మా ఆవిడ, అబ్బాయి పెళ్ళివిషయంలో తొందర పడసాగింది. పిల్ల గుణవంతురాలయితే చాలు; వాళ్ళ స్థితిగతుల విషయంలో మాకాట్టే పట్టింపు తొలినుంచీ లేదు.

చయనులు దగ్గరికి వెళ్ళినప్పుడల్లా సంభాషణలో మెల్లగా యీ విషయాన్ని ధ్వనింపచేసేవాడ్ని. వాడు నా అభిప్రా-

యాన్ని గమనించినట్లే కనిపించేవాడు కాదు.

రకరకాలుగా ట్రిక్స్ చేసేవాడ్ని.

"మా వాడికీ సమ్మరులో మారేజ్ చేసేద్దా మనుకుంటున్నానోయ్' అనే వాడ్ని. "అలాగా, మంచిదిరా ఏం చదివించావేమిటి" అనేవాడు. అంతే కాని, వాడి ముఖంలో నే నాశించిన విధంగా రంగులు మారేవి కావు. "కట్నాలు తీసుకునే ప్రసక్తేలేదు సుమీ! అది నాకూ, నా వరానికీ బొత్తిగా యిష్టం లేనిపని " మరో ఆశ చూపించాను. ఉహూఁ! వాడు పట్టించుకోనిదే! "చిన్నప్పటి ఆదర్శాలని నిలబెట్టుకుంటున్నావన్నమాట!" నవ్వేవాడు నాకు చిరాకనిపించేది. వాడు నన్ను మించిపోయినట్టు ప్రవర్తిస్తున్నాడు.

ఓరోజు లావణ్య, తండ్రిని తీసుకుని మా యింటికొచ్చింది. తండ్రిని సోఫాలో కూర్చోపెట్టి, తను వంటింటివేపు వెళ్లింది. ఆమెకు వరలక్ష్మి దగ్గర బాగా చనువు యేర్పడింది!


రేడియో సిలోన్‌నుంచి తెలుగుపాటలు ప్రసారం చేస్తోంది. లేచి, రేడియో కట్టేసి, ఫాన్ వేసివచ్చి సోఫాలో కూర్చున్నాను. వరలక్ష్మి రాజమ్మచేత డ్రింకులు పంపించింది. డ్రింకులు తాగేక ప్రారంభించాను : "ముఖస్తుతి కాదుగానీ, నారే చేనులూ! లావణ్య గుడ్ గర్ల్ అనుకో! మా ఆవిడ కెంత నచ్చిందో చెప్పలేను... చూశావా....తనతో కబుర్లలో పడిందా! ఇక మన ఉనికిని గుర్తించేటట్లే ' పెద్ద విట్టు వేసినట్లుగా గలగలా నవ్వేశాను. "అయితే మీ కోడలుగా చేసేసుకోరాదూ?" అంటా డనుకున్నాను ; లేదు—అనలేదు! చిన్నగా నవ్వి ఊరుకున్నాడంతే.

నా కోపం వచ్చింది. మా వాడి కొస్తున్న సంబంధాలన్నీ వాడి ప్రవర్తన విషయంలోనే బెడిసి కొడుతున్నాయి. వాడి ప్రవర్తన సరిదిద్దుకుంటే కాని వాడికి పెళ్ళి కాదేమోనని మా ఆవిడకి బెంగపట్టుకుంది. పెళ్లయితే కాని ప్రవర్తన కుదుట పడదుట!

మా ఆవిడ పోరు గుర్తొచ్చి చివరిసారిగా కొంచెం డైరక్టుగానే ప్రవర్తించాను. "ఏరా, లావణ్యకింకా ఎంతకాలం పెళ్ళి చెయ్యకుండా వుంచుతావు? ఏదో సంబంధం చూసి ముడెయ్యాలి కాని " ఇలా అనడం ఎంత సబబుగా వుంచో నేనాలోచించలేదప్పుడు.

వాడి ముఖంలో దైన్యం స్పష్టంగా గోచరించింది. సోఫా కవరుమీద చేత్తో రాస్తూ అన్నాడు 'చేసేద్దామనే నాకూ వుందిరా . నా ఆరోగ్యం కూడా కుదుట బడింది కదా! సీతానగరం వెళ్ళిద్దానిక్కడికి పంపిస్తాను. అక్కడ మాకు చేసేందుకు రెండో అమ్మాయి వుంది,ఎప్పుడూ యింట్లో అందరికీ రోగాలూ రొష్టులూ."

వాడికింకా నలుగురు పిల్లలూ, నాలుగువేలు అప్పూ, బోలెడు కష్టాలు ఉన్నాయి.



కాదన్ను. ఇప్పుడా సొదంతా ఎందుకు? నా ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పడేం?

వాడూ ట్రిక్స్ చేస్తున్నాడా? నా కోపం ముంచుకువచ్చింది. అవసరానికి ఆదుకుని లావణ్యకి ఉద్యోగం ఇప్పించక పోతే వీళ్ళ పనేమై వుండేది? ఒక్క పిసరు కృతజ్ఞత చూపిస్తున్నారూ? నేను చాలా అన్యాయంగా ఆలోచిస్తున్నా నన్న సంగతి నా కప్పుడు తట్టలేదు. ఇంకా అన్యాయంగానూ, అసహజంగానూ ఆలోచించగల్ను. ప్రవర్తించగలను కూడా! లేకపోతే ఈ మేడా కారూ కొనగలనా?

ఇంతలో మా వాడెక్కడ్నుంచో వచ్చాడు. వచ్చినవాడు టాక్సీలో రావటం మానేసి రిక్షాలో వచ్చాడు. రిక్షా దిగుతూనే చిల్లర డబ్బుల విషయంలో రిక్షావాడితో పెద్ద గొడవ పెట్టుకుని నానా రభసచేసి వాడ్ని కొట్టినంత పని చేశాడు. నాకు తల తీసేసినట్లయింది. విసుక్కుంటూ వెళ్ళి వాళ్ళిద్దర్నీ విడిపించి, రిక్షావాడు అడిగి నంతా యిచ్చి వాడ్ని పంపించేశాను. మా వాడు విసురుగా వెళ్లి తన గదిలోకిపోయి

చభాలున తలుపులు వేసుకున్నాడు.

లావణ్య వున్నప్పుడు వాడు రావటం ఇది నాలుగోసారి. ప్రతిసారీ తుఫానులాగే వాడి ఆగమనం. లావణ్య వాడ్ని చూడకుండా ముఖం చప్పున ఎటో తిప్పేసుకుంటూ వుంటుంది.

వాడినామె అసహ్యించుకుంటోందా?

వాడ్ని చేసుకుందుకు ఒప్పుకోదేమిటి చెప్మా?

నాకు రానురాను పట్టుదల హెచ్చవుతోంది. ఎలాగయినా ఆమెనే కోడలిగా తెచ్చుకుందామన్న కోరిక నాలో బలపడుతోంది. ఈ చయనులు పలకడేం? మే మే ముందుగా ఎలా పలకటం?

వరలక్ష్మి, లావణ్య మాట్లాడుకుంటూ డ్రాయింగ్ రూంలోకి వచ్చారు. "లావణ్యని ఇక మా యింట్లోనే ఉంచేసుకుంటాం అన్నయ్యగారూ:" నవ్వుతూ యధాలాపంగా అన్నట్లుగా అంది వరలక్ష్మి.

"అలాగేనమ్మా' అని నవ్వేశాడు. నాకు మండిపోయింది. ఎంత గర్వం!

ఇంతలో ఏవరో నలుగురు కుర్రాళ్ళు వచ్చి వాడ్ని పిలుచుకుపోయారు. వాళ్ళని చూస్తూనే గతుక్కుమంది లావణ్య. వాళ్లంతా ఎక్కడో ఆమెను అల్లరిమాటలంటూ, వెకిలిగా ప్రవర్తిస్తూ, యేడిపించినవాళ్ళే అయివుంటారు, లేకపోతే అంత చేదుగా ముఖమెందుకు పెడుతుంది? వాళ్ళు వెళ్ళిపోయాక నావేపు చురుగ్గా చూసి...."వాళ్లు" ఏదో అనబోయింది.

"మా అబ్బాయి ఫ్రెండ్స్....ఆల్ ఆర్ గ్రాడ్యుయేట్స్" నా నాలుకకి నరం ఉంటేకదా? ఏమనుకుందోయేమో. లావణ్య మరేమీ మాట్లాడలేదు. మరి కొంత సేపుండి వాళ్లు వెళ్ళిపోయారు.

వరలక్ష్మి నవ్వుతూ వాళ్లని సాగనంపి వొచ్చి, పరధ్యానంగా కూర్చువ్న నన్ను చూసి, కుదుపుతూ అడిగింది. "ఏమండీ యిలా అయిపోయారూ?" అని.


"ఏంలేదు . మా చేనులు గాడికి ఏరు దాటాక తెప్పని కాల్చేయటంలో ఇంత అనుభవం ఎప్పుడొచ్చిందా అని:"

వరలక్ష్మి తెల్లబోయింది. నా ధోరణి అంతుబట్టలేదని ఆ ముఖమే చెబుతోంది. "వీడి టెక్కు నాదగ్గర కాదు . ఈ లావణ్య ఉద్యోగం పీకి పారెయ్యటం నా చేతిలోని పని" అన్నాను అసహ్యంగా.

వరలక్ష్మికి నా మాటలు శ్రుతి కఠోరంగా తోచి అంది, "ఏమిటండీ ఆ మాటలు: ఇప్పుడేమయింది!" అని.

*   *

ఏమయిందో వరలక్ష్మికి కొద్ది రోజుల్లోనే అర్థమయిపోయింది. చయనులు ఆంతర్యం అంతుబట్టక, మా బంధువులా మెద్వారా వ్యవహారం నడిపించాను. లావణ్యను మా అబ్బాయి కివ్వటం యింట్లో ఎవరికీ నచ్చలేదనీ, అసలా ఆలోచనే లేదనీ తేలిపోయింది.




గంటకి ఎనభై మైళ్ళ వేగంతో కారు నడుపుతున్నారు మీరు....
గంటకి ఎనభై మైళ్ళా?! నేను బయల్దేరి ఇంకా పావుగంటైనా కాలేదే!

నాకు ఉడుకుమోతుతనం వచ్చేసింది. చయనులని తరచుగా కలవటం మానేశాను. నాకోపాన్ని ఆఫీసులో లావణ్యమీద చూపించటం ప్రారంభించాను. ఈ పరిణామానికి మా ఆవిడ మొదట్లో చాలా బాధపడినా, చివరకి సమాధానపరచుకుంది. "ఏం చేస్తాం లెండి? దేనికయినా ఘటనంటూ ఉండాలి కదా? వాడి కెవర్తి రాసిపెట్టి ఉందో!" నేనలా వూరుకోలేకపోయాను, వాళ్ళు నేను చేసిన సహాయానికి కృతజ్ఞత తీర్చుకోవాలా, వద్దా? ఏం చూసుకుని ఈ గర్వం!

ఈ సంబంధం కాకపోతే మావాడికింక పెళ్ళిగాదేమోనన్న భయం నాకు ఉందేమో ననుకో నక్కరలేదు. మా ఆవిడ సరిపుచ్చుకున్నంత తేలికగా సరిపెట్టుకోలేకపోయాను. అదీకాక—ఎలా జరగాలో అలా జరిగేది, నే ననుకున్న విధంగానే ఎందుకు జరక్కూడదూ?" అంటాను.

ఆ రోజు చయనులు దగ్గరకి వెళ్లాను. ఇంటికి తాళం వేసివుంది. వాళ్ల బంధువుల యింటికి వెళ్లివుంటారని ఊహించి, కారు అక్కడే నిలిపి నడుచుకుంటూ ఆ యింటికి వెళ్లాను.

ఇంట్లో అంతా పెద్దగా మాట్లాడుకుంటూ నా రాకనే గమనించలేదు.

"...ఆ అబ్బాయి ప్రవర్తన మంచిదేమీ కాదని అంతా అంటున్నదే . చూస్తూ చూస్తూ అలాంటివాడికి నిన్నెలా యివ్వటం? కాని ...మా చలపతి! ... వాడు మనని కష్టంలో ఆదుకున్నాడు.... వాడికి నిన్ను కోడలిగా చేసుకుందామని యెంతో యిదిగా వుంది...." చయనులు గొంతు.

"అవున్నాన్నా! ... ఆయన ఋణం ఎంత చేసినా తీరదు,...కాని..,ఆయన మన నుంచి ఆశించే ప్రతిఫలం యిదా! ఆ

అబ్బాయి సంగతి ఆయనకి తెలిసింది కనుకనా? ఆయన నిర్లక్ష్యంవల్లనే ఆ అబ్బాయి యిలా తయారయ్యాడు . నిప్పు మనకెన్నో విధాలుగా ఉపయోగ పడ్తుందని దోసిట్లోకి స్వీకరించి వాళ్ళో పోసుకోం కదా! .... క్షమించండి ..నా వైవాహిక జీవితంగురించి నాకూ కొన్ని కనీసపు కోరికలుంటాయి ...ఏమైనా . అతన్నిమాత్రం చేసుకోలేను!''

అప్పుడే నేను కొంచెం మనసులోని మాలిన్యాన్నంతా కడిగేసుకుని వినగలిగితే అడుంలో ఆర్ద్రతగుర్తించి, కరిగిపోయి ఉ దేవాడిని కాని .మనసులో కుళ్లు పేరుకుపోయింది! నా అహం దెబ్బతింది. విసురుగా యింట్లోకి వెళ్లకుండానే వచ్చేశాను.

నా వెర్రికోపానికి ఫలితం? లావణ్య వుద్యోగానికి ఉద్వాసన చెప్పటం జరిగింది! మా ఆవిడ ఊరికే వేధిస్తూవుంటే, "ఆఫీసులో స్టాఫ్ తగ్గించాల్సి వొచ్చి, అనివార్యంగా లావణ్యని ఉద్యోగంనుంచి తీయించేల్సి వొచ్చింద''ని చెప్పాను. నా నాలుకకి శుద్ధి ఎప్పుడుందని!

"ఆ అమ్మాయి నుదుటిరాత అలా వుంది పాపం" అని జాలిపడింది మా ఆవిడ.

* *

నేనూహించినట్లుగానే మా వాడు తను ప్రేమించిన అమ్మాయిని కాస్తా పెళ్ళిచేసుకుని ఇంటికి తీసుకొచ్చేడు. వరలక్ష్మిఏం గొడవపెడుతుందో అని భయపడ్డాను. కాని ఆవిడ కోడల్ని సాదరంగానే స్వీకరించింది. నా కొక సమస్య తీరినట్లయింది. ఆ పిల్ల రాకతో వాడు మారితే ఎక్కడో. ఎదో వుద్యోగంలో వాడ్ని దూర్చేయటం నా కంత కష్టమయిన పనేమీకాదు.

నా ఆశలు అడియాసలేనని కొద్దినెలల లోనే తేలిపోయింది.

ఆ అమ్మాయి వచ్చిన తొలి ఆరు నెలలూ సినిమాలకనీ పక్నిక్‌లకనీ తెగ తిరిగేవాళ్ళు ఆ తరువాత రోజూ ఎందుకో వాళ్ళ కొక్కక్షణం పడేదికాదు. ఎందుకో కీచులాడుకునేవాళ్ళు వాడు ఒక్కోసారి వెర్రి ఉద్రేకంలో బాగా కొట్టేవాడు. ఆ అమ్మాయి దుఃఖం చూడ లేక పోయేవాళ్ళం. వీళ్ళ ప్రేమ తగ లేసిరి' అనుకున్నాను. వరలక్ష్మి మనసులో బాధపడేది.

ఓ రోజు ఉండబట్టక, వరలక్ష్మి ఎదుట వాడి ప్రవర్తనని నిరసిస్తూ మాట్లాడాను. ఈ వెధవ కింక బాగుపడే యోగ్యత లేదన్నాను .

వరలక్ష్మి నిట్టూర్చి "లలాట లిఖిత మండీ! ఏం చేస్తాం" అని ఊరుకుంది. నే నింకా ఏదో అంటే, "వాడి పెళ్లాన్ని వాడు కొట్టుకుంటాడు .చంపుకుంటాడు. మన జోక్యం వుంటే గొడవలు మరింత పెరుగుతాయి కాని చల్లారవు!" అంది.

"నీకు వాడంటేనే సింపతీ—అందులో సగమయినా నామీద లేదు" అని విసు

క్కున్నాను.

వరలక్ష్మి నవ్వింది : "మీ గురించి ఇంకొకరు జాలి పడాల్సిన అవసరం కల్పించుకోనందుకు మీరు గర్వించాలి" అంటూ

*　　　*

రోజులు గడిచేకొద్దీ వాడా అమ్మాయిని పెట్టే హింసల్ని చూస్తే కడుపు తరుక్కుపోయేది. ఒక్కోరోజు జుత్తు పట్టుకుని బరబరా గదిలోకి యీడ్చుకుపోయి చితకబాదేవాడు.

అలాంటప్పు డనిపించేది : "లావణ్యకి న్యాయమే జరిగిందేమో!" అని!

*　　　*

ఆఫీసు టూర్‌మీద ఓ పదిహేను రోజులు వెళ్ళి. నేను తిరిగి వచ్చేసరికి ఈ మధ్యలో రెండు దారుణాలు జరిగాయి....

మా అబ్బాయి పరారీ అయిపోయాడు.

పట్టుకెళ్ళిన పెద్దమొత్తం కరిగిపోగానే వా డొస్తాడన్న నమ్మకం నాకుంది.

చయనులు పోయాడు!

మళ్ళీ రాడు. భగవాన్! ఇక చయనులు లేడు!

లావణ్య సీతానగరంనుంచి నా పేర ఓ ఉత్తరం రాసింది. ".... నాన్న పోయారు. చివరిలో మీ కోసం ఎంత కలవరించారో తెలీదు....చివరిలో అక్కడ చాలా యిబ్బందులు పడ్డాం....చనిపోతూ నాన్న ఒక్క ముక్కమాత్రం చెప్పారు: "అమ్మా, లావణ్యా....వాడు నీ ఉద్యోగం తీసేసాడని నాకు కోపం లేదమ్మా....ఈ పట్టుదల వాడికి చిన్నప్పట్నుంచీ ఉండటం నే నెరుగుదును....వాడికి నిన్ను కోడలిగా చేసుకుందామని ఎంత కోరికగా ఉందో! అలా కాదన్నామని అక్కసు యిలా తీర్చుకున్నాడు ..అమ్మాయ్....నీ మనసు మారితే మాత్రం, మా చలపతి కోరిక తీర్చమ్మా" అని....

"మా నాన్నగారి చివరి కోరిక తీర్చలేక పోతున్నందుకు చాలా విచారిస్తున్నాను ... మీ అబ్బాయి రిజిస్టరుపెళ్ళి చేసుకున్నారుట కదూ?

'అందుకే అసలు పెళ్ళే చేసుకోకుండా అవివాహితగానే ఉండిపోదామనుకుంటున్నాను....నామీద ఆధారపడ్డవాళ్ళు ఇక్కడ చాలామంది ఉన్నారు....వరలక్ష్మి పిన్నిగారికి నా నమస్కారాలందించండి ..."

*　　　*

లావణ్య రాసిన ఉత్తరం మా ఆవిడ ఎప్పుడు చూసిందో, "పాపం...లావణ్య... ఆ అమ్మాయి పరిస్థితి తలుచుకుంటూ వుంటే ఎంతో జాలిగా ఉందండీ!" అంది.

నేను నిట్టూర్చి అన్నాను : "ఆమెను మనం కోడలిగా తెచ్చుకుంటే యింకా జాలిపడాల్సి వచ్చేది....అవును కదూ?"

వరలక్ష్మి బాధగా తలూపింది.